

[5–10–47 సంచిక నుండి

౧౪

"ఆర్యాపురంలో మేమున్న యింటి కెదురుగా ఒక వకీలు. చాలా పెద్దచెయ్యి. చులాగ్గా నెలకి వెయ్యి రూపాయిలు సంపాదించేవాడు; కాని ఖర్చులో మహా జోరు. రాజమహేంద్రవరంలో ప్రజాహితకార్యాలేవి జరిగినా మొదటి చందా ఆయనది. పెద్ద చందా కూడా ఆయనదే. ఈ పట్నానికంతకీ "బ్రూహాం" బండి ఆయన ఒక్కడికే వుండేది, ఆ దినాల్లో. ఇప్పుడు రోల్సు రాయిస్ కారు అంటే యెంత ఘనతో, అప్పుడది అంటే అంత గొప్ప. దానిమీద ఆయన కోర్టుకి వెడుతూ వుంటే మహారాజు అన్నట్టుండేవాడు. గృహకృత్యాల్లో కూడా, తోచకే పోవాలి గాని, యేదయినా ఖర్చు వచ్చిందంటే యిక వెనకా ముందూ లేదాయనకు"

"అంచేత, పదేళ్ళు ప్రాక్టీసయినా మనిషి మిగలడమే. అద్దె కొంపే. వెనకా ముందూ సద్దు బాల్లే"

"రెండో పెళ్ళి పెళ్లాం యిదంతా పరకాయించింది. ఆలోచించింది. తటపటాయించింది. సాహసించింది. ఆఫీసుఖర్చులన్నీ పోను, మిగిలిన దాల్లో సగానికి సగమూ తన చేతిలో పోస్తే గాని అన్నం పెట్టనని భీష్మించుకూర్చుంది, చివరికి"

"ఆయనైనా మంచి పకడైన మనిషి కాని జజమ్మ కాదు. ఎలాంటి కక్షిదారూ కూడా ఆయన యెదట పిల్లి అయి వుండేవాడు. అలాంటి ప్రభుశక్తి అంతా చూపిన్నూ, ఆయన, మొదట అగ్గయిపోయాడు. తరవాత వురిమాడు, పరవళ్లు మ్రానతొక్కాడు. ఒక్క నెలదినాలు ఆవిడకేసి చూడ్డం మానుకున్నాడు; కాని బుస్సలు కొడుతూ కొడుతూనే, రెండో నెల పూర్తి కావచ్చాటప్పటికి ఆమెకి లొంగిపోయి వూరుకున్నాడు."

"నెలకి నెల అంతా వచ్చిన సొమ్ము ఆయన దగ్గిరే వుండేది. ఖర్చులన్నీ రివాజు ప్రకారం గుమాస్తాలే చేసేవారు; కాని వొకటో తేదీని, ఆఫీసు తెరిచిన వెంటనే, వున్నదంతా రెండు భాగాలు చేసి, ముందు, భార్యాభర్తలకిచ్చేసి, తరవాతే పెద్దగుమాస్తా పని ప్రారంభించేవాడు. అందుకు ఫలితంగా, నా కొక్క రూపాయి అప్పు కావలసివచ్చాటప్పటికి, అద్దెకొంప కొనేసి ఆయన చక్కని మేడ కట్టాడు. భర్తపేరనే ఆవిడదగ్గిర యూభైవేలు చేరాయి"

"సోదెమ్మకయ్యగారయినా, అంత వకీలుకి తగిన దర్జాగానే వుండేది. పురుషులలో ఆయనలాగే స్త్రీలలో ఆమె నాయకమణిగా వుండేది. ఎలాంటివాళ్ళతోనూ ఎంతో ఆదరంగానూ, మిక్కిలీ ప్రీతిగానూ మాట్లాడేది. మహా మంచి యిల్లాలు. బీదరాలని మా అమ్మ నెప్పుడూ ఆమె చిన్నచూపు చూడలేదు. "పిన్నిగారూ" అంటూ యెంతో చనువుగా మాట్లాడుతూ మా అమ్మని ఆమె క్షణం అయినా విడిచివుండలేకపోయేది. ఈ ఔదార్యాన్ని నమ్ముకుని, నేను, అవి జ్ఞాశ్రయించాను. అంటే, వొక్క రూపాయి అప్పడిగాను. "మళ్లీ వొక్క నెలకిచ్చేస్తా"నని గడువు కూడా చెప్పాను"

"తీరా అడిగేశాను; గాని తరవాత, నేను, చాలా సిగ్గుపడ్డాను. "లే" దన్నా "యివ్వ" నన్నా బాధ లేదు; కాని "యెలా తీరుస్తావ్?" వంటే యేమిటి చెప్పడం? అయితే, నా నీడ చూసుకునే నేను జంకాను; కాని ఆవిడ నా మాట కొట్టెయ్యనూ లేదు, విపరీతప్రశ్నలూ వెయ్యలేదు. "ఒక్క రూపాయి భాగ్యానికి బదులేమిటి తమ్ముడూ? అందుకోనూ నీకా? పట్టుకు వెళ్ళవోయ్" అంటూ వెంటనే రూపాయి తెచ్చి

ఆనందవాణి *



[ప్రచురితమగుతున్న కొత్త సీరియల్]

యిచ్చారు. "నేనే వద్దన్నాను; కాని ఆవిడ "ఇంకో రూపాయి కూడా యివ్వనా?" అనే అడిగారు పాపం"

"అబ్బాయీ! నా వర్తకానికీ, నా మేడలకూ, నా భూములకూ, నా వైభవానికీ, నా సర్వస్వానికీ అదిగో, ఆవొక్క రూపాయే మూలం. ఇవాళ, యెనిమిది లక్షల కధికారి అయివున్న చెంబోలు శంభుశాస్త్రి స్వతంత్ర జీవితం ఆ వొక్క రూపాయితోనూ పరిణతి చెందింది."

౧౫

"ఆ వొక్క రూపాయీ పుచ్చుకుని నేను బజారుకి బయలుదేరాను. "జాగ్రత్త సుమా బాయన్నా" అని మంగళాశాసనం చేస్తూ, మా అమ్మ, వీధిగుమ్మందాకా వచ్చి సాగనంపింది. ఇది వింటూంటే నీకు నవ్వు వస్తోంది, నేను గుర్తించకపోలేదు; గాని నువ్వు చేస్తున్న ప్రయత్నం యెలాంటిదో నువ్వు మరిచిపోయావు. తన తాహతు తాను గుర్తించుకునే యోగ్యతే వుంటే, నీకే కాదు, మన ఆంధ్రజాతికే యిప్పుడీలాంటి గతి పట్టకపోవును."

"కాకపోయినా, ఆవొక్క రూపాయీ పుచ్చుకు బయలుదేరిన నేను, అప్పుడు, లక్ష రూపాయీలు చేతిలో వుండినంత ధీమాగా వుండినాను, నువ్విది తెలుసుకోగలవా?"

"ముందుముందు, జాతి నుద్ధరించే మహానుభావుడే అవతరిస్తాడో, సర్వనాశం తెచ్చిపెట్టే క్రూరుడే పుట్టుకువస్తాడో తెలియకపోయినా గర్భవతి అయివుండిన లేజవరాలిని చూస్తే సభ్యలోకం నెత్తిమీద పెట్టుకుంటుంది. ఆ గర్భరక్షణకు అనేకమంత్రాలూ, విధులూ యేర్పడివున్నాయి. బానిసచిత్తవృత్తికి వర్తకంలో వుండిన విశిష్టత బోధపడదు; గాని ఆ రూపాయి చేతిలో వున్న నేనూ అప్పుడలాగే వున్నాను. ఏమంటే?

ఆ వొక్క రూపాయీ నన్నాకాశాని కెత్తెయ్యనూవచ్చు, తాను నుసి అయిపోయి, నాకు నామరూపాలు పుట్టకుండానూ చెయ్యవచ్చు."

"ఏమయినా, నా ఆశా, మా అమ్మ ఆశా ఆ వొక్క రూపాయిమీదా సుడితిరుగుతున్నాయి. కాక:—నాకు వర్తకం నడుస్తుందో నడవదో ఆ వొక్క రూపాయీ తేల్చేస్తుంది. ఒక మనిషి జీవితం, వెలుగుతోనూ చీకటితోనూ నింపెయ్యగల రూపాయి అది, నువ్విది అవగాహన చేసుకోగలవా?"

"మనిషికి వన్నె తెచ్చేది ప్రవర్తనే గాని, వొడ్డూ పొడుగూ కాదు. అలాగే రూపాయికిన్నీ వన్నె తెచ్చేది విలువే గాని దాని పనివాడితనం కాదు. అయితే, లక్షాధికారి చేతిలో వుంటే రూపాయి వొక చిల్లపెంకు. నిరుపేద చేతిలో వుంటే అదే వొక పెద్దగాను. ఇది మనిషి తాహతును పట్టి వచ్చిన వ్యత్యాసమే గాని ఆ రూపాయి విలవ ఏమీ తేడా లేదు. ఆ రూపాయి చేతికి రావాలంటేమాత్రం, లక్షాధికారీ భిక్షాధికారీ చూపించవలసిన పురుషకారం వొక్కటే, భిన్నం కాదు. కనుక, పురుషకారం బాగా వినియోగించుకోడంలో వుంది; గాని పెట్టుబడి హెచ్చుతక్కువలలో లేదు విజయం."

"ఆదిలో, నెలకి నాలుగు రూపాయిల జీతం మీద విజయనగరం సంస్థానంలో నౌకరుగా ప్రవేశించిన జోగి జగన్నాథరాజు, క్రమాంతరాల మీద కొంత కాలానికి దివానయి, ఆ సంస్థానమే కాదు, చివరికి, ఆ రాజునే యేలాడు. నీకిది తెలుసా?"

"ఏవంచ:—దమ్మిడీ అయినా అప్పు పుట్టదనుకున్న వాడు ఆదరపురస్సరంగా ఆ రూపాయి అప్పు దొరకడంలోనే వుంది విశేషం. అంటే యేమిటో

బోధపడిందా? ఆ రూపాయి, ఒక భిక్షువుని మైనారిటీ కొడుక్కూడా విలువ వుందని నిరూపించిన దీటురాయి. అయితే, దాని విలువ కెప్పుడూ భంగంలేదు. మరి, నా విలువకూడా భంగపడకుండా వుండేటట్టు చూసుకోగలిగితే?"

"ఇలాంటి జీవితం విలువలన్నీ నా కప్పుడు తెలియవు, నిజమే. అయితే, అప్పుడు, ఆ బయలుదేరడం, ఎక్కడో రూపాయిలు గుట్టలు పడివుండినట్టూ, మొయ్యగలిగినన్నీ అవి తెచ్చుకోడానికి నేను వెడుతున్నట్టూ అనిపించింది. ఇలాంటి ఉత్సాహంతో గుమ్మం దిగాటప్పటికి నేను భావాంబరవీధుల్లో ఎక్కడికెక్కడికో తేలిపోసాగాను; కాని రెయిలు పట్టాలు దాటాటప్పటికి "ఆగు" అంటూ గుండెలమీద చెయ్యివేసి నన్నెవరో గుంజేసినట్టూ, 'వెళ్ళి యేమి వర్తకం చేస్తావోయ్?' అని నిలవతీసి అడుగుతున్నట్టూ అయి తక్షణ ఆగిపోయాను."


ఆయుర్వేద వైద్యనిలయం వారి

'లుకోరియా క్యూర్'

★

స్త్రీలకు తరచు సంభవించు శ్వేతరక్తప్రదర రోగములకు, బహిష్టు నొప్పులకు దివ్యౌషధమని 10 సంవత్సరముల అనుభవముచే చెప్పగలుగుచున్నాము. ఇంకను దీనిని సేవించుట వలన ఇతర గర్భాశయ వ్యాధులన్నియు నిర్మూలమై వంధ్యత్వము తొలగును. అనేకమంది దీర్ఘరోగులకు వాడి గుణము పరీక్షింపబడిన ఆయుర్వేద ఔషధరాజము.

90 మాత్రల ప్యాకెట్ రు. 2-8-0

(ప్యాకింగ్, పోస్టేజి అదనం)

★

గమనింపు:-మా చిరునామా మార్పు గమనింపుడు.

ఆయుర్వేద వైద్యనిలయం

రామానాయుడుపేట, మచిలీపట్నము.

అన్ని మందులషాపులలోను దొరకును.


"నా స్వతమే, ఏమి వర్తకమూ చెయ్యడం? 'వర్తకం, వర్తకం' అన్నీ వుబలాటమేగాని 'ఏమిటా వర్తకం?' అని అప్పటివరకూ నాకు ఆలోచనే పోలేదు. అంచేత, యిది స్ఫురించాటప్పటికి, నేను, నిర్విణ్ణుణ్ణయిపోయాను. తీరా సరుకు కొందామని బయలుదేరాటప్పటి కిలాంటి గుంజాటన కలగడం, నాకు, నా వర్తకాని కేదో విఘాతం మూడిందన్నంత నిరుత్సాహం కలిగింది. నిజంగా, అప్పటి నా చిత్తక్షోభ నువ్వు గ్రహించాలేవు, విడమర్చి నేను చెప్పాలేను. కాని సరిగా ఆ సమయాన 'బండి కావాలా?' అంటూ వచ్చి నన్నొక జట్కామనిషి నా మొగాన మొగంపెట్టి అడిగాడు. దాంతో, నేను ప్రకృతిలో పడ్డాను. వెంటనే 'డబ్బు రావాలిగాని యేమి వర్తకం అయితే యేమిటి?' అని నన్నెవరో సముదాయించినట్టయింది. 'నిజమే' అనుకున్నాను. నేననుకోకుండానే నాకు ముందడుగు పడింది. నిలిచిపోయిన నేను బజారుకేసి నడుస్తున్నట్టు నాకు తెలిశాటప్పటికి దామోదరరావు హోటలుదగ్గర వున్నాను."

"ఎడతెగని అంగళ్ళ కదే మొదలు. కుడివైపున నడివీధిలోనే పూల అంగళ్ళతోనూ, ఎడమవైపున పుస్తకాల అంగడితోనూ ప్రారంభమైన ఆ బజారులో, వెళ్ళినకొద్దీ. ఉప్పూ, చింతపండూ అమ్మే చిల్లరఅంగళ్ళు మొదలుకుని బంగారమూ, రత్నాలూ అమ్మే పెద్ద అంగళ్ళదాకా అన్ని రకాలవీ ఉన్నాయి. నిరాదరణ లేకుండా బంగులుదేరిన నా కళ్ళ కవన్నీ ఉజ్వలంగానే కనపడ్డాయి. కొనుక్కునేవాళ్ళు ప్రతి అంగడిలోనూ ముసురుకుంటూనే వున్నారు. నాగరికజీవితానికి వాటిలో అనవసరమైన అంగడి వొక్కటీ లేదు. ఇంతేకాదు, శ్రద్ధగా చూసుకుంటే లాభం చేకూర్చనిదన్నీ వొక్కటీ లేదు.

[ఇంకా వుంది]

